క్లుప్తంగా

అలరిస్తున్న మహాభారత యజ్ఞం



హరికథ చెబుతున్న భాగవతారిణి జ్యోత్స్న

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం అందరినీ అలరిస్తోంది. సోమవారం హరికథా భాగవతారిణి జ్యోత్స్న తన బృందంతో కలిసి కౌరవ, పాండవుల జననం ఘట్టాన్ని వివరించారు. అలాగే రాత్రివేళ వేంకటేశ్వర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనలు కొన సాగుతున్నాయి. వీటిని తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి విశేషసంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారు.

ప్రతి గడపకు వెళ్లి సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: మండలంలోని ఆవులపల్లె, నంజంపేట, పొదలగుంటపల్లె, సోమల, దిద్దువారిపల్లె సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లకు, గృహసారథులకు ఎంపీపీ ఈశ్వరయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంఎల్ఓ మౌలాలి అవగాహన కల్పించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, వైస్ ఎంపీపీలు ప్రభాకర్, సయ్యద్‌బాషా, సర్పంచులు కోదండరాజు, వెంకటరెడ్డి, జయరాం, రాజేశ్వరి, ఎంపీటీసీలు అపరాజిత, మహమ్మద్ అలీ జిన్నా, సావిత్రమ్మ పాల్గొన్నారు.

మదర్‌థెరిసా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



కరెస్పాండెంట్ చేతులమీదుగా డిగ్రీ అందుకుంటున్న బిటెక్ విద్యార్థి

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్, ప్లేస్‌మెంట్ డే దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు బిటెక్, డిగ్రీలను పుచ్చుకున్నట్టు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. 2022–23 ఏడాదిలో బిటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేసే కార్యక్రమంతోపాటు ప్లేస్‌మెంట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏట టాప్‌లో రూ.11.85లక్షల ప్యాకేజీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.


భగవద్గీత పఠనంతోనే శాంతి



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

కుప్పంరూరల్: భగవద్గీత పఠనంతోనే శాంతి, సౌభాగ్యం కలుగుతుందని ప్రబోధానంద సేవా సమితి ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆది, సోమవారాల్లో గుండ్లపల్లె, కత్తిమానుపల్లె క్రాస్ గ్రామాల్లో ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం చేశారు. కృష్ణ మాట్లాడుతూ, భగవద్గీత పఠనంతోనే ప్రతి సమస్యకు సమాధానం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగరాజు, శరవణ, మంజునాథ్, కృష్ణారెడ్డి, వెంకటేష్, చరణ్, లోకేష్, ఇందిరా, వెంకటలక్ష్మి, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

కందుల పంపిణీ



కందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్ బాబు

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం సర్పంచ్ రమేష్ బాబు రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కోగిలేరు సచివాలయానికి 120 కిలోల కందులు వచ్చాయని, వీటిని రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కంది సాగు చేసిన రైతులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్ రెడ్డి, సుబ్రమణ్యం, ప్రకాష్, పెద్దన్న, సెరికల్చర్ అసిస్టెంటు నరేష్, రైతులు పాల్గొన్నారు.

4 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం

- 2 లక్షల కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి దగా చేసిన చంద్రబాబు
- బాబుది మోసపూరిత మేనిఫెస్టో
- రామకుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బందార్లపల్లె సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం/రామకుప్పం: అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రామకుప్పం మండలంలో ఆయన పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మొదటి సంవత్సరంలోనే ఉద్యోగాల విషయంలో సీఎం మాట నిలబెట్టుకున్నారని పైవిధంగా చెప్పారు. చంద్రబాబు 2014లో అధికారంలోకి రాగానే రెండు లక్షల కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి రోడ్డున పడేశారని విమర్శించారు. ప్రస్తుతం మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టో మరోమారు మళ్లీ దగా చేసేలా ఉందన్నారు. ఇవే కాకుండా మరో రెండు మేనిఫెస్టోలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథంగా జగన్‌మోహన్ రెడ్డి భావిస్తే, చంద్రబాబు మాత్రం ప్రజలను దగా చేయడానికే మేనిఫెస్టోలను ప్రకటిస్తున్నారనే గమనించాలన్నారు. రైతు రుణాల మాఫీ చేయడం, ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో సాధ్యం కాదని తెలిసి తాము హామీ ఇవ్వలేదని, బాబు చేస్తామని చెప్పి మాట తప్పాడన్నారు. రుణమాఫీ చేయక పోగా, ఓట్లకోసం పసుపు–కుంకుమ తీసుకువచ్చిన మహిళలను మోసం చేశారని విమర్శించారు. తాము రూ. 26 వేల కోట్లను దశల వారీగా వైఎస్సార్ ఆసరా కింద మహిళ ఖాతాల్లో జమ చేశామన్నారు.

పాలారును అడ్డుకున్న బాబు

కుప్పం నియోజక వర్గానికి తాగు, సాగునీటి కల్పనకు పాలారు వద్ద ప్రాజెక్టు నిర్మానానికి అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత రాజశేఖరరెడ్డికి దృష్టికి తానే తీసుకెళ్లానని మంత్రి చెప్పారు. సానుకూలంగా స్పందించి నిధులను సైతం కేటాయిస్తే, తమిళ ప్రభుత్వంతో కలిసి కోర్టుకు వెళ్లి ప్రాజెక్టును ఆపిన వంచకుడు బాబు అని మండిపడ్డారు. ఆయనకు కుప్పంపై ఎలాంటి మమకారం లేదన్నారు. అప్పుడు రాజశేఖరరెడ్డి కుప్పం ప్రజలపై అభిమానం చూపితే, అదే బాటలో జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. కుప్పానికి రెవెన్యూ , పోలీస్ డివిజన్లు తెచ్చి రాష్ట్ర ప్రజలంతా తనకు సమానమని నిరూపించారని ఉద్ఘాటించారు.

జగన్ సురక్ష సద్వినియోగం చేసుకోండి

జూలై1 నుంచి అమల్లోకి రానున్న జగన్ సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంకనూ సంక్షేమ పథకాలు అందని వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడక్కనే వరాలు ఇచ్చే దేవుడు జగన్ : సిపాయి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అడగకనే వరాలు ఇచ్చే దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. కుప్పం ప్రజలు పునరాలోచించాలని, చంద్రబాబు హామీలతో నట్టేట ఎలా ముంచాడో అర్థం చేసుకోవాలని, తమ సీఎం నెరవేర్చిన హామీలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందనేది గుర్తెరగాలని కోరారు.

పారదర్శకంగా నవరత్నాలు: జెడ్పీ చైర్మన్

తమ ప్రభుత్వ పాలనలో నవరత్నాల పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా వీటిని ఇచ్చామని, జనం కోసం పని చేస్తున్న తమ పార్టీకే మళ్లీ పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు.



పంద్యాలమడుగులో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం గెలుపుతో రుణం తీర్చుకోండి : ఎంపీ

ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకులను ఆదరించాలని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కోరారు. చంద్రబాబు హైదరాబాద్ నుంచి రిమోట్ పాలన అందిస్తారని, అదే భరత్‌ను గెలిపిస్తే స్థానికంగా ఉండి ప్రజల సమస్యలు తీరుస్తారని చెప్పారు. కుప్పంకు అన్నీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రుణం తమ అభ్యర్థి గెలుపుతో తీర్చుకోవాలని ప్రజలను కోరారు.

ఇక్కడ బాబు చేసిందేమీ లేదు : భరత్

కుప్పం ఓట్లతో గెలిచి ముఖ్యమంత్రి అయినా చంద్రబాబు కుప్పం ప్రజలకు చేసిందేమీ లేదని ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. గ్రామీణ ప్రాంత సమస్యలు ఏరోజూ పట్టించుకున్న పాపానపోలేదని, తమ పార్టీ అధికారంలోకి రాగానే నిత్యం నాయకులతో గ్రామాలకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నామని, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పథకాల ఫలాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. అలాగే, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడారు. కురబ కులస్తులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్, రెస్కో చైర్మన్ సెంథిల్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఎంఎంసీ చైర్మన్ విద్యాసాగర్, స్థానికులు సుబ్రమణ్యం, నితిన్‌రెడ్డి, సెంథిల్, అప్పి, నారాయణస్వామి, ఆరేళ్ల జయప్ప, హేమాచలపతి,లు ఉన్నారు.

నేటి నుంచి శిక్షణ

పులిచెర్ల(కల్లూరు): మండలంలో మంగళ, బుధ వారం జగనన్న సురక్షపై సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సచివాలయాల కన్వీనరు ముర్వత్ బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 27న చల్లావారిపల్లె, మతుకువారిపల్లె, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లె, వెంకట దాసరపల్లె, అయ్యావాండ్లపల్లె, దిగువపోకలవారిపల్లె, కల్లూరు, దేవళంపేట, పాళెం, ఎర్రపాపిరెడ్డి గారిపల్లె, 102 ఇ.రామిరెడ్డిగారిపల్లె, రాజులపల్లెలో ఉంటుందన్నారు. 28న కావేటిగారిపల్లె, రాయవారిపల్లె, యల్లంకివారిపల్లె, పోశంవారిపల్లె, మంగళంపేట, నన్నూరువారిపల్లె, గడ్డంవారిపల్లె, రేణుమాకులపల్లె, 106రామిరెడ్డిగారిపల్లె, కమ్మపల్లె, పులిచెర్ల, రెడ్డివారిపల్లెల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా సోమవారం తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

13న గుడివంకలో వేలం

గుడుపల్లె: గుడివంక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ అంగళ్ల గేటు వేలం జూలై 12న బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం తెలిపారు. వేలంలో తలనీలాలు పోగు చేసుకోవడానికి, అంగళ్ల గేటు వసూలుకు బహిరంగ వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ10వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. ఆలయ బ్రహ్మోత్సవాలు ఆగస్టు 3నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు సచివాలయ సిబ్బంది చొరవ చూపాలని ఎంపీడీఓ నాగరాజ సూచించారు. సోమవారం ఆయన దిద్దువారిపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ యూనిఫాం తప్పక ధరించాలన్నారు. సకాలంలో బయోమెట్రిక్ వేయాలని, దాని ఆధారంగానే జీతాలు చెల్లిస్తామని తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకంలో భాగంగా వచ్చిన ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే సచివాలయ పరిధిలో పేదలకు అందజేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంఈఓ శివరత్నమ్మ

సోమల: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ–2 శివరత్నమ్మ అన్నారు. సోమవారం మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కుసుమాంబ అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా పూర్తిగా తీర్చిదిద్దిందన్నారు. అలాగే ప్రతి విద్యార్థి కూడా ఉన్నత చదువులు చదవాలన్న ఆకాంక్షను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధించడంతో ప్రస్తుతం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి మక్కువ చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పీసీ కమిటీ చైర్మన్ రస్నా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా బోధించండి

సోమల: మండలంలోని కలమందలవారిపల్లె ప్రాథమిక స్కూల్‌ను ఎంఈఓ–2 శివరత్నమ్మ సోమవారం తనిఖీ చేశారు. స్కూల్‌లోని రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలు బోధించాలని టీచర్లకు సూచించారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కిషోర్, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు

చౌడేపల్లె: సమాజంలో ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు అన్నారు. సోమవారం చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రయోగశాలకు ఉపయోగపడే పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో ఉన్నత పాఠశాలకు రూ.2 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని గుర్తుచేశారు. విద్య, వైద్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల కోసం అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద తదితర పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కల్పించడం కోసం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు మురళి, గాజుల మోహన్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని యాలకల్లు పంచాయతీ గ్రామ సచివాయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎం.ఎం.కుంట కల్లూపల్లి, వైసీ బండపల్లి, యాలకల్లు గ్రామాల్లో 745 గృహాలను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి ఎమ్మెల్యే సందర్శించారు. ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో కుల,మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ప్రతి గడపలోనూ ఘన స్వాగతం లభించడం జగనన్న పాలన పట్ల ప్రజల్లో ఉన్న సంతోషానికి నిదర్శనమన్నారు. ఈ ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదచల్లే కార్యక్రమాలకు తెరతీస్తున్నారని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో ప్రజలు తెలియజేసిన సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పై స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. ఈ నాలుగేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో పేదల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయని చెప్పారు. అర్హత ఉన్నా ప్రతిఒక్కరికి జగనన్న పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వహించి ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీమ్‌ఖాన్, జెడ్పీ సలహదారు ఎస్ఎ గౌస్, మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మన్లు శ్రీరాములరెడ్డి, గోపిరెడ్డి, రెస్కో డైరెక్టర్ భూపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు మణి, వేణు, సర్పంచ్ బషీర్, ఎంపీటీసీ విజయశాంతి, సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై దాడులు

పలమనేరు: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణాలపై శానిటేషన్ అధికారి రమణ సచివాలయ సిబ్బందితో కలసి సోమవారం దాడులు నిర్వహించారు. స్థానిక మదనపల్లె రోడ్డులోని ఐదు దుకాణాలకు రూ.5వేల జరిమానాలను విధించారు. సిబ్బంది గోవిందు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పలమనేరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రవి సూచించారు. పట్టణంలోని వాణి డిగ్రీ కళాశాలలో సోమవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జస్టిస్ రవి మాట్లాడుతూ ఈ కాలం విద్యార్థులకు సినిమాలు, స్మార్ట్‌ఫోన్లే లోకంగా మారాయన్నారు. కళాశాలలో ర్యాగింగ్ చేయడం చట్ట విరుద్ధమని, కొన్ని కళాశాలల్లో అమ్మాయిలు సైతం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తుపదార్థాలకు లోను కారాదని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి రెడ్డి, న్యాయవాదులు భాస్కర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు



నవీన్(ఫైల్)

సదుం: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ షామీర్‌బాషా సోమవారం తెలిపారు. భట్టువారి పల్లె ఎరుకులపురానికి చెందిన నవీన్(23)కు ఎస్ఆర్ పురానికి చెందిన ఓ యువతితో ఈనెల 29న వివాహం నిశ్చయమైంది. ఈక్రమంలో బంధువులకు శుభలేఖలు పంచేందుకు ఈనెల 22న అతను ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తల్లి ఉషా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

సదుం: జగనన్న సురక్ష కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప అన్నారు. తిమ్మానాయనపల్లె, కంభంవారిపల్లె, పాలమంద, ఊటుపల్లె సచివాలయాల్లో జగనన్న సురక్ష అవగాహన సమావేశాలు సోమవారం జరిగాయి. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉండరాదని వారు సూచించారు. కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్‌లు మురళీరెడ్డి, రెడ్డిదీప, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఎంఎల్ఓ బావాజీ, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ సేవలో మాజీ జేడీ



అమ్మవారిని దర్శించుకున్న లక్ష్మీనారాయణ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ అమ్మవారిని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు అధికారులు అమ్మవారి చరిత్రను వివరించారు. ఆయన వెంట భవానీ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా నాడు-నేడు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

కుప్పం రూరల్: నాడు–నేడు పనులను పారదర్శకంగా చేస్తున్నట్లు అడవిబూదుగూరు ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు చెప్పారు. సోమవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. వివిధ పథకాల పరంగా వచ్చిన నిధులు, వాటి వ్యయం వివరాలను తెలియజేశారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు.

స్కూళ్లను తనిఖీ చేయండి

రొంపిచెర్ల: పాఠశాల కమిటీలు తరచూ స్కూళ్లను తనిఖీ చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. చిచ్చిలివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన పాఠశాల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని నిత్యం కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు. విద్యాబోధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎలా ఉందని తెలుసుకోవడంతో పాటు పాఠశాల కమిటీలు చురుగ్గా పని చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మ, హెచ్‌ఎం వెంకట్రామయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



పుంగనూరు: మాట్లాడుతున్న జడ్జి కార్తీక్



పలమనేరు: విద్యార్థులు, పోలీసుల ర్యాలీ

పుంగనూరు: మాదకద్రవ్యాల వినియోగంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, ఒక్కసారి వాటి బారిన పడితే జీవితాలు పాడవుతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్ అన్నారు. సోమవారం పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని న్యాయమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాలతో జరిగే కీడు గురించి వివరించారు. న్యాయమూర్తి కార్తీక్ మాట్లాడుతూ హైస్కూల్, కళాశాలలో మాదకద్రవ్యాలను వ్యాపారులు మాయమాటలు చెప్పి అలవాటు చేస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. సమావేశంలో ఎస్ఈబి సీఐ సీతారామిరెడ్డి, న్యాయవాదులు వీరమోహన్‌రెడ్డి, వెంకట్రమణ పాల్గొన్నారు.

చౌడేపల్లిలో..

చౌడేపల్లి: డ్రగ్స్ వాడి మత్తుకు బానిసలై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ ఎస్ఐ రవికుమార్ సూచించారు. సోమవారం జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజానికి యువత సహకరించాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

సోమలలో..

సోమల: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్‌కేవీస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జయరాం అన్నారు. సోమవారం కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 14500ను ప్రవేశ పెట్టారని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మత్తు పదార్థాలకు ఎవరూ బానిస కావద్దని ఎస్ఈబీ సీఐ శ్రీనివాసమూర్తి, కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. మండలంలోని అగ్రహారం వద్ద ఉన్న ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. తమ భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా అమ్ముతుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం సూచిక బోర్డులను రోడ్డు కూడలిలో ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవం సందర్భంగా రొంపిచెర్ల పురవీధుల్లో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చాలామంది యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం సెబ్ అధికారులు, పోలీసులు పట్టణంలో డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రకరకాల మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. పిల్లల వ్యవహార శైలిపై తల్లిదండ్రుల నిఘా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సరఫరాచేస్తే కఠినమైన శిక్షలు పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు చంద్రశేఖర్, అశోక్‌కుమార్, సెబ్ సీఐ ఎల్లయ్య, పలువురు ఎస్ఐలు, ఎస్ఎస్ఎస్ వలంటీర్లు, పోలీసు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన

పెద్దపంజాణి: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై సోమవారం మండల కేంద్రంలో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల యువత వ్యసనాలకు బానిసవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



చౌడేపల్లెలో..



సోమల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జయరాం



పెద్దపంజాణి: మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన ర్యాలీ